

దోర్నకల్ మండలంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జస్వంత్‌నాయక్, బానోత్ మోహన్ (ఫైల్)

మృత్యుదారులు

బెంబేలెత్తించిన వరుస రోడ్డు ప్రమాదాలు

- పలు కుటుంబాల్లో విషాదం నింపిన యాక్సిడెంట్లు
- ఏప్రిల్ 20 నుంచి మే 25వ తేదీ వరకు 30 ఘటనలు
- పది మందికిపైగా మృతి.. తీవ్ర గాయాలపాలైన 20 మంది
- డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం, అతివేగమే కారణం

తొర్రూరు రూరల్, జూన్ 6 : రోడ్లు రక్తమోడుతున్నాయి.. వరుస ప్రమాదాలతో వాహనదారులు, జిల్లా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం తాగి అతివేగంగా డ్రైవింగ్ చేస్తుండటంతోనే రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా, మరికొందరు తీవ్రగాయాల పాలవుతున్నారు. అయితే గత ఏప్రిల్, మే మాసాలు కావడం, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో ఇతర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు స్వగ్రామాలకు చేరుకున్నారు. అలాగే ఎక్కువగా శుభకార్యాలు ఉన్న నేపథ్యంలో గ్రామాలకు వచ్చిన యువకులు బైక్‌లపై చక్కర్లు కొట్టి ప్రమాదాల బారిన సంఘటనలు కూడా ఉన్నాయి. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడుపుతోండటంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని అంచనా. మహబూబాబాద్ జిల్లాలో ఏప్రిల్ 20 తేదీ నుంచి మే 25వ తేదీ వరకు సుమారు 30కి పైగా రోడ్డు ప్రమాదాలు వరగ్గా.. ఈ ప్రమాదాల్లో 10 మందికి పైగా మృత్యువాతడ్డారు. అలాగే 20 మందికి పైగా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. దీంతో బాధిత ఆయా కుటుంబాలు విషాదంలో ఉండగా, మరికొన్ని కుటుంబాలు కుటుంబపెద్ద గాయపడటంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇప్పటి వరకు బయటకు తెల్సిన ప్రమాదాలు ఇవైతే, తెలియకుండా రాజీకుదుర్చుకొని వెళ్లిన ప్రమాదాలు కోకొల్లలు. ఇలా రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే డ్రంకెన్‌డ్రైవ్ విషయంలో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ, వారి లక్ష్యాలను పూర్తి చేసుకునేవిధంగా నామమాత్రంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారని, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘటనల్లో కొన్ని..

కొన్నిరోజులుగా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్ద, చేతికి అందివచ్చిన కుమారులు మృతి చెందారు. ఆయా ఘటనల్లో కొన్నింటికి సంబంధించిన వివరాలు..

- ఏప్రిల్ 20న చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కుల హరీష్ (35), జక్కుల తేజ (5) తండ్రి కొడుకులు బైక్‌పై తొర్రూరు మండల కేంద్రంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చి వెళ్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ట్రావెల్ పెళ్లి బస్సు మాటేడు గ్రామశివారులో ఎదురెదురుగా ఢీకొట్టడంతో అక్కడిక్కడే ఇద్దరు మృతి చెందారు.
- ఏప్రిల్ 21న డోర్నకల్ శివారులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వెన్నారం గ్రామ శివారు రామకుంటతండాకు చెందిన తేజావత్ జస్వంత్ నాయక్(23), ఖమ్మం జిల్లా కాశీరాజుగూడెం శివారు ఆరేకోడు తండాకు చెందిన బానోత్ మోహన్(47) భార్య పిల్లల ముందే అక్కడిక్కడే దుర్మరణం చెందారు.
- ఏప్రిల్ 24న పెద్దవంగర మండలంకు చెందిన ఎడవెల్లి అశోకొరెడ్డి (47) ద్విచక్రవాహనంపై తొర్రూరుకు వచ్చివెళ్తుండగా, మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ 26న చనిపోయాడు.
- ఏప్రిల్ 24న పెద్దవంగర మండలం కొరిపెల్లి శివారులో బైక్ అదుపుతప్పి తొర్రూరు మండలం జీకే తండాకు చెందిన గుగులోతు రాధిక(40) మృతి చెందగా, ఆరేళ్ల కుమారుడు మధు తల్లిని కోల్పోయాడు.
- ఏప్రిల్ 28న మరిపెడ శివారు నేతావత్ తండా వద్ద బైక్‌పై వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో.. జయపురం గ్రామానికి చెందిన గంగుల సతీష్ (32) మృత్యువాత పడ్డాడు.
- మే 8న నెల్లికుదురు మండలంలో బొలెరా వాహనం ఢీకొని రాజస్థాన్‌కు చెందిన జయంతిలాల్ (25) మృతి చెందగా, సర్వత్ గాయపడ్డారు.
- మే 11న తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామ శివారులో అర్ధరాత్రి కారు-ఆటో ఢీకొన్నది. ఈ ఘటనలో పెద్దవంగర మండలానికి చెందిన చింతం జస్వంత్ (16) ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందాడు.
- మే 19న గార్ల మండలం తిర్లాపురం గ్రామం శివారులో రెండు బైక్‌లు ఢీ కొట్టడంతో వెంకటాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ అశోక్ (37) మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు.
- మే 21న తొర్రూరు మండలం పత్తేపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింహులపేట మండలం నర్సింగపురం గ్రామ శివారు పత్తితం డాకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి బానోత్ భరత్ (19), బావ రఘు ఇద్దరు హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై ఓ శుభకార్యానికి వస్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొని, మృతి చెందాడు. దీంతో తనకు ఐదుగురు కుమార్తెల తరువాత ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లి కన్నీరుమున్నీరైంది.
- మే 22న మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో కారు-బైక్ ఢీకొని బోడ రాములు (70) మృతి చెందారు. ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపే వారు, కుటుంబానికి చేదోడుగా ఉండే పెద్దదిక్కు కోల్పోవడంతో వారి కుటుంబాన్ని చీకటికమ్మేసింది.
- మరిపెడ బస్టాండ్ సెంటర్‌లో గ్రానైట్ లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో పలువురి స్వల్పగాయాలు అయ్యాయి. మరిపెడలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు గాయపడ్డారు.
- గూడూరు- మహబూబాబాద్ రహదారిపై ఆర్టీసీ బస్సును ట్రాలీ ఢీకొని ఒకరు, కేసముద్రం మండలం కల్వల సమీపంలో ట్రాలీ ఆటో-బైక్ ఢీకొని బావోజీతండాకు చెందిన రవి, ఎన్నికల ప్రచార సభకు వెళ్లివస్తుండగా గార్ల మండలం ముల్కనూరు శివారులో ఆటో బోల్తాపడి 10 మంది, గంగారం మండలం చింతగూడెంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కల్తీ సారయ్య, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు అయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా ఇలా సుమారు 20 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ వేసవి ఎంతోమంది కుటుంబాల్లో విషాదఛాయలు నింపింది. ప్రమాదాల నివారణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద స్థలాలను గుర్తిస్తున్నాం

– సురేష్, తొర్రూరు డీఎస్పీ



ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాద స్థలాలు గుర్తిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా కఠిన చర్యలు చేపడుతున్నాం. ఎక్కువగా తొర్రూరు, మరిపెడ శివారుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవి సెలవు కావడంతో మైనర్లు వాహనాలు నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారు. తల్లిదండ్రులు ఇలాంటి ప్రోత్సహించకుండా సహకరించాలి. ప్రభుత్వం తీసుకువచ్చిన ఉత్తర్వుల మేరకు జరిమానాలు, జైలు శిక్షలు విధించడం జరుగుతుంది.



వివరాలు వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

నల్లగొండలో కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ఫస్ట్‌ప్రయారిటీలో మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యం
- ద్వితీయ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్యతా కోటా ఓటు రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం
- నేటి సాయంత్రానికి తుదిఫలితం వచ్చే అవకాశం

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నిక ఫలితం ఇంకా తేలలేదు. గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయినా కోటా ఓట్లు రాకపోవడంతో రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి గానీ విజేతపైస్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. గురువారం మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697 మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లున్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి

మిగతా 8వ పేజీలో..

మొత్తం ఓట్లు	4,63,839
పోలైన ఓట్లు	3,36,013
అభ్యర్థుల సంఖ్య	52

మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలు

చెల్లని ఓట్లు	25,824
చెల్లిన ఓట్లు	3,10,189
కోటా ఓటు	1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్‌ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824

రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మానుకోటలోని విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 6 : వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, లేని పక్షంలో డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. మానుకోట పట్టణంలోని కిసాన్ అగ్రి మాల్‌లో గురువారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన దుకాణంలో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న విత్తనాల నిల్వలను పరిశీలించారు. ధరల పట్టిక, ఇన్‌వాయిస్, స్టాక్ రిజిస్టర్, రోజువారీగా జరిగిన అమ్మకాలు, ఖరీదులు చేసిన రైతుల వివరాలు ఉన్న రిజిస్టర్లను, బిల్లులను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అనుమతిలేని విత్తనాలు, నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. లూజు విత్తనాలు అమ్మినా, నకిలీ విత్తనాలు విక్రయించినా వ్యాపారులపై పీడీ యాక్టులతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండలాల వారీగా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ టాస్క్‌ఫోర్స్ టీంలు ప్రతిరోజు విత్తన దుకాణాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకొని, రిపోర్టును పంపించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు, మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విచారణ తీరుపై రైతుల విమర్శలు

- పచ్చిరొట్ట విత్తనాల ఘటనపై ఏఈవోల వివరాల సేకరణ
- విత్తనాల పక్కదారిపై నిలదీసిన రైతు



తొర్రూరులో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీపై ఏఈవోలు వివరాలను సేకరిస్తుండగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతు అశోక్‌రెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 6 : జిల్లాలోని తొర్రూరు మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టిన విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అలాగే వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ఓ రైతు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి దానికి సంబంధిం చిన రిపోర్టు పంపించాలని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడును ఆదేశించారు. దీంతో అభిమన్యుడు ఈ ఘటనపై మరిపెడ ఏడీఏ శోభన్‌బాబును విచారణకు ఆదేశించారు.

గురువారం తొర్రూరు మండల వ్యవసాయాధికారికి ఏడీఏ మెమో జారీ చేశారు. అనంతరం ఏడీఏ తొర్రూరు మండలానికి వచ్చి ఏఈవోలను విచారణ చేసి చెప్పాలని ఆదేశించారు. దీంతో ఏఈవోలు రైతులను పిలిపించి విచారణ జరుపుతుండగా, అమ్మపురానికి చెందిన కందాడి అశోకొరెడ్డి అనే రైతు వచ్చి ఈ విచారణపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారిపై పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టాయని మంత్రికి ఫిర్యాదు చేస్తే మండల వ్యవసాయాధికారి పైస్థాయి అధికారులను విచారణ అధికారులుగా నియమించి విచారణ చేపట్టాల్సి ఉండగా, ఏవో కింది స్థాయి ఏఈవోల ద్వారా విచారణ చేయించడం ఏమిటని ప్రశ్నించారు.

ఏఈవోలే విచారణ అధికారులు..

ఏడీఏ స్థాయి అధికారులు విచారణ చేయాల్సిన ఈ ఘటనలో ఏఈవోలు చేస్తోండడం అనేక విమర్శలు తావిస్తోంది. జీలుగ విత్తనాలు రైతులకు ఇవ్వకుండా అదే రైతుల పేర్లపై ఇతర ప్రాంతాలకు విక్రయించినట్లు తెలిసింది. ఏఈవోలు ఆగ్రోసెంటర్లకు వెళ్లి కొనుగోలు చేసిన రైతుపేర్లు, ఫోన్ నెంబర్లను సేకరించారు. అనంతరం ఫోన్‌ద్వారా రైతులను పిలిపించి, విచారణ చేపట్టారు. దశరథం అనే రైతు నాలుగు బస్తాలు తీసుకున్నట్లు రికార్డులో ఉండగా, తాను జీలుగ బస్తాలు తీసుకోలేదని ఏఈవోల ముందు వాపోయాడు. ఓరుగంటి సోమయ్య అనే రైతు నాలుగు బస్తాలు తీసుకున్నట్లు ఉండగా, తాను ఒక్కబస్తా తీసుకోలేదని సమాధానం ఇచ్చారు. అమ్మాపురానికి చెందిన రైతు కృష్ణారెడ్డి ఆగ్రో సెంటర్ నుంచి రెండు బస్తాలు తీసుకుని వెళ్లగా, అతడి పేరుపై 8 బస్తాలు తీసుకున్నట్లు ఎందుకు రాశారని ప్రశ్నించారు. గ్రానైట్ క్వారీ ఉన్న నర్సింహరెడ్డి అనే రైతు 8 బస్తాలు తీసుకున్నట్లు రికార్డుల్లో నమోదై ఉంది. అయితే రైతుల నుంచి వివరాలు సేకరించిన ఏఈవోలు.. కర్షకుల నుంచి ముందుగానే తెల్ల కాగితంపై రాసుకుని ఉంచుకున్న పత్రాలపై ఆ రైతుల సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయశాఖ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వ్యవసాయశాఖ అధికారి వద్ద మాత్రమే ఉంటుంది. అయితే ఆగ్రోస్ సెంటర్‌కు యాజమానులకు ఆ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వ్యవసాయాధికారి ఇవ్వడంపై అనేక విమర్శలకు తావిస్తోంది. దాంతో ఆగ్రోస్ సెంటర్ల యాజమాని పచ్చిరొట్ట విత్తనాల కోసం వచ్చిన కొంతమంది రైతులకు ఆగ్రోస్ సెంటర్ నుంచి ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా అప్పటికే తమవద్ద కొంతమంది రైతులకు చెందిన ఆధార్‌కార్డులు, పట్టాదారుపాస్‌పుస్తకాలు ఉంటే ఆ రైతుల పేర్లపై కూడా పచ్చిరొట్ట విత్తనాలు తీసుకువెళ్లినట్లు నమోదు చేశారు. రైతుల పేర్లపై ఇచ్చిన బస్తాలను పక్కదారి పట్టించారు. ఇప్పటికైనా పక్క జిల్లా నుంచి ఏఈ పైస్థాయి అధికారులతో విచారణ జరిపితే ఇంకా అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏడీఏనే విచారణ అధికారి : అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి



తొర్రూరు పరిధిలో పచ్చిరొట్ట విత్తనాల సంఘటనపై మరిపెడ ఏడీఏ శోభన్‌బాబునే విచారణ అధికారి. ఆయనే స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి విచారణ చేపడుతున్నారు. ఏఈవోలు విచారణ అధికారులు కారు. ఈ విచారణ ఒక్కరి వల్ల అయ్యేది కాదు. ఏఈవోల సాయం తీసుకుని విత్తనాలు ఎన్ని వచ్చాయి అనే విషయంపై రైతులను అడిగి తెలుసుకుంటున్నాం. తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుంటున్న వార్త నా దృష్టికి రాలేదు. అలా అధికారులు తీసుకునే అవకాశం లేదు.

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

- నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ
- నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు
- రాళ్లతో ప్రయాణికుల దాడి.. ప్రతిదాడులు చేసిన దుండగులు
- బాధితురాలిది విజయవాడ.. కాజీపేట రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు



బాధితులు అన్నె కవిత దంపతులు

6లో..

‘బడిబాట’ షురూ..



దోర్నకల్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బంది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్6 : జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాలు, గిరిజన తండాల్లో ముందస్తుగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని బ్యానర్లతో ర్యాలీలు, కరపత్రాలు, ప్రదర్శనలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడానికి బడిబాటలో భాగంగా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బడిబాటలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 84 మంది విద్యార్థులకు నూతనంగా ప్రవేశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని అమలు చేస్తున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ బాధ్యులతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రెండు జతల ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రవాణా చార్జీలు, మధ్యాహ్న భోజనం,ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేస్తున్నారు. బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేల ప్రచారం ప్రారంభించారు.
- కస్తూర్బా బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాఠశాలల్లో చేరే విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న మౌళిక వసతులు చూపించి, ఆడపిల్లలకు కల్పిస్తున్న ప్రత్యేకతలను ఉపాధ్యాయులు వివరిం చారు.



అమ్మాపురంలో విద్యార్థులకు అడ్మిషన్ దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న డీఈవో రామారావు

వివిధ మండలాల్లో..

మహబూబాబాద్ మండలం అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కల్లెం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు దేశబోయిన వెంకన్న, కవిత, శశిధర్, బలాష్టి రమేష్, భూక్య బాలాజీ, యుగేందర్, ఉస్మాన్, రామాచారి, హైమ, రజిత, మీనా పాల్గొన్నారు.

- పెద్దవంగర మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రాజలింగం, ఉపాధ్యాయులు సదయ్య, సకీం పాష, అంజయ్య, యాకయ్య, శ్రీధర్, విజయ్‌కుమార్, సువర్ణ, గౌరి, శంకర్, షౌకత్‌అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డీఎస్‌బీ స్కూల్, బాలికల పాఠశాల,

మిగతా 8వ పేజీలో..

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

చిలుపూర్/కాజీపేట, జూన్ 6: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం అర్థరాత్రి దాటిన తర్వాత జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని నష్కల్ - పెండ్యాల రైల్వే ట్రాక్ వద్ద దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో రైలు ఆగిన తర్వాత నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికుల మెడల్లోంచి దొంగల ముఠా బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్‌లు, బ్యాగులు చోరీ చేశారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5తోపాటు ఎస్-11 స్లీపర్ కోచ్‌లలో ఈ చోరీలు జరిగినట్లు తెలుస్తోంది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్, బాధితురాలు అన్నె కవిత తెలిపిన వివరాలు ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన అన్నెపు కవిత.. తన భర్త సాయిరమేశ్, ఇద్దరు పిల్లలు, మామతో కలిసి షిరిడీ దర్శనానికి వెళ్లింది. తిరిగి విజయవాడకు వచ్చేందుకు సికింద్రాబాద్‌లో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. అయితే నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా నర్సాపూర్ రైలు నష్కల్ సమీపంలోకి రాగానే లోకోపైలెట్ వేగం తగ్గించాడు. అయితే దుండగులు ఇదే అదునుగా భావించి ఆ రైలులో కిటికీ పక్కన నిద్రిస్తున్న అనిత మెడలో ఉన్న బంగారు గొలుసును బయటనుంచి లాగారు. మధ్య బెర్త్‌లో నిద్రిస్తున్న కవిత మెడలో నుంచి ఎవరో చైన్‌లాగినట్లు అనిపించడంతో ఒక్కసారిగా అప్రమత్తమై లేచింది. అప్పటికే దుండగులు గొలుసు లాగేశాడు. అలాగే అమె మెడలో నుంచి మరో బంగారు తాళిని తెంపే క్రమంలో గట్టిగా పట్టుకుంది. కిటికీల్లో నుంచి చూడగా దుండగులు ఒకరి భుజంపై మరొకరు ఎక్కి కిటికీల వద్ద ఉన్న ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీలు చేస్తున్నారు. దీంతో కవిత పెద్దగా కేకలు వేయడంతో నిద్రమత్తులో ఉన్న మిగతా ప్రయాణికులు అందరూ లేచారు. కవిత కేకలకు పారిపోతున్న దొంగలను చూసిన ప్రయాణికులు రైలు దిగి రాళ్లతో దాడి చేస్తూ దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగలు సైతం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న రాళ్లతో ప్రతిదాడులు చేశారు. వెంటనే ప్రయాణికులు తిరిగి రైలెక్కి రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమమైన రైల్వే అధికారులు రైల్వే టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేశారు. ఆపై రైలు యథావిధిగా వెళ్లింది.

గురువారం ఉదయం రైల్వే జీఆర్పీ పోలీసులతో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, చిలుపూర్ ఎస్‌ఐ ముత్యం రాజేందర్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కాగా, కవిత తన కుటుంబంతో సహా విజయవాడకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. 12 గ్రాముల బంగారు చైన్‌తో పాటు ఇతర వస్తువులు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాలపై పోలీసులను వివరణ అడగగా.. నష్కల్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల దృష్ట్యా రైలు మెల్లగా వస్తుండడంతో దుండగులు దోపిడీకి పాల్పడ్డారా..? అదే రైలులో వచ్చి రైలు ఆగగానే దోపిడీ చేశారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీ అయ్యాయో పూర్తి వివరాలు తెలియడం లేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు అంటున్నారు.

ఇదిలా వుండగా, అర్ధరాత్రి చీకటిలో జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సినీ పక్కీలో జరిగిన ఈ చోరీలను చూస్తున్న ఇతర ప్రయాణికులు అసలు ఏమి జరుగుతుందో అర్థంకాకుండా ఉండిపోయారు. తొలుత దోపిడీ దొంగలు అర్ధరాత్రి రైల్లోకి చొరబడి మహిళలను మారణాయుధాలతో బెదిరించి వారి మెడల్లోంచి 25 తులాల బంగారాన్ని దోచుకెళ్లినట్టు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఈ చోరీల్లో సుమారు 20 మంది ముఠా సభ్యులు పాల్గొన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.



నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో విచారణ చేపడుతున్న పోలీసులు

28న డాక్ అదాలత్

సుబేదారి, జూన్ 6: తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుంచి స్వీకరించేందుకు ఈ నెల 28న పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ వారు 46 డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల14 లోపు కె.శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ఆఫీస్ ఆఫ్ పోస్టు మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ 500001కు వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాల్‌పల్లి, జనగామ జిల్లాల ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. పోస్టల్ కవర్‌పై 46 డాక్ అదాలత్ అని రాసి పంపించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపటి నుంచి దూరవిద్య పీజీ ప్రాక్టికల్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ దూరవిద్య పీజీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫస్టియర్ పరీక్షల ప్రాక్టికల్ పరీక్షలు శనివారం (జూన్ 8)నుంచి ప్రారంభిస్తున్నట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న బోటనీ, 9న ఫిజిక్స్, 12న జువాలజీ, కెమిస్ట్రీ, 13న కెమిస్ట్రీ మరో పేపర్ ఉంటాయని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత డిపార్ట్‌మెంట్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

జేఎన్‌ఎస్‌లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు



100 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 6: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి పది రాష్ట్రాల నుంచి 971మంది అథ్లెట్లు, 100మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ హనుమకొండ వాస్తవ్యుడు కావడం మనకు ఎంతో గర్వకారణమని కొనియాడారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజు 1000, 1500, 10వేల మీటర్ల పరుగు పందెం, షాట్‌ఫుట్, లాంగ్‌జంప్, 400, 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్, 300మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 150మీటర్ల పరుగు, 80, 50 మీటర్లు పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, హెప్టథ్లాన్, డెకాథ్లాన్, జావెలిన్‌త్రో, ట్రిపుల్‌జంప్, 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, 4ఇంటూ400రిలే విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15 నుంచి 17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

కాగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు జీవంజి దీప్తీ, అగసర నందిని, సాయి సంగీతలు క్రీడా మైదానంలో సందడి చేశారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను చూసి మైదానంలో పలువురు చిన్నారులు, వర్ధమాన అథ్లెట్లు సెల్ఫీలను దిగుతూ అలరించారు. ఈ సందర్భంగా పారా ఒలంపియన్ జీవంజి దీప్తి, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్ నందినిలను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అసోసియేషన్ బాధ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్, అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, చంద్రమోహన్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు వాసుదేవ్, మనోజ్‌కుమార్, సోమేశ్వర్, జగన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి..

జీవంజి దీప్తి, అంతర్జాతీయస్థాయి పారా అథ్లెట్, కల్లెడ

జపాన్ దేశంలోని యానివేసియేడ్ మెమోరియల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్ టీ20 చాంపియన్‌షిప్ 400మీటర్ల పరుగుపందెంలో 55.07 సెకన్లలో గమ్యాన్ని చేరి ప్రపంచ రికార్డు నెలకొల్పాను. అథ్లెటిక్స్‌లో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై స్వర్ణ, రజత పతకాలు సాధించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదు. నిరుపేద కుటుంబంలో జన్మించిన నాకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు భరోసాగా నిలవాలి.

ఒలింపిక్స్‌లో అర్హత సాధించడమే లక్ష్యం

సాయి సంగీత, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ మహబూబ్‌నగర్

ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన జూనియర్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4ఇంటూ400రిలేలో స్వర్ణం సాధించాను. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే కఠోర సాధన చేయాలి. కోచ్‌ల ప్రత్యేక శిక్షణలో తర్ఫీదు పొందుతూ వారు చూపించిన విధంగా నడుచుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుకుంటూ అక్కడి కోచ్ వద్ద అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సంవత్సర కాలంగా కర్నాటక రాష్ట్రంలోని మంగుళూర్‌కు చెందిన కోచ్ అజిత్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటూ అక్కడే డిగ్రీ ప్రథమ సంవత్సం చదువుతున్నా.

అంతర్జాతీయ క్రీడాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

అగసర నందిని, ఏషియన్ గేమ్ మెడలిస్ట్ హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని పథకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సహంతోపాటు నివాస స్థలం కేటాయించాలి. ఇతర రాష్ట్రాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారులు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇటీవల చైనాలో జరిగిన హెప్టథ్లాన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాను. ఈ నెల 27నుంచి 31 వరకు హరియాణా రాష్ట్రంలోని పంచకుల లో నిర్వహించనున్న అంతర్‌రాష్ట్రాల హెప్టథ్లాన్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి ఒలంపిక్స్ అర్హత సాధించేందుకు కసరత్తు చేస్తున్నా.

దర్గాలో ప్రార్థనలు.. అమ్మవారికి పూజలు

కాజీపేట దర్గా, భద్రకాళిని దర్శించుకున్న కడియం కావ్య



కాజీపేట దర్గాలో ప్రార్థన చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య తదితరులు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కావ్యకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

కాజీపేట టౌన్ / వరంగల్ కల్చరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కడియం కావ్య గురువారం కాజీపేట దర్గా, వరంగల్ భద్రకాళి ఆలయాలను సందర్శించారు. తన తండ్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాజీపేట దర్గాకు వచ్చిన ఆమెకు పీఠాధిపతి ఖుస్రుపాషా ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను వరంగల్ ప్రజలకు రుణపడి ఉంటానని, తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ముస్లింలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కోసం శ్రమిస్తానన్నారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా విలసిల్లుతోందన్నారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ అబూబకర్, మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే పలువురు కుటుంబ సభ్యులతో కలిసి కావ్య భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానార్చకుడు భద్రకాళి శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను కావ్యకు అందజేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన తోడ్పాటును అందించాలని వేడుకున్నానన్నారు.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

దరఖాస్తుల దాఖలు గడువు పెంపు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఆశోక్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైనిక్ స్కూల్/అకాడమీలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ (హెచ్ఈపీ), బీఎస్సీ (ఎంపీసీ) 40 చొప్పున సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుల దాఖలకు చివరి తేదీని జూన్ 15 వరకు పొడిగించిటన్లు తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి విద్యార్హత ఇంటర్, రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారని, ఫీజు రూ.100 అని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నింపి సంబంధిత పత్రాలు జత చేసి ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ (బి), ఆశోక్‌నగర్ పేరు మీదరూ. 100 డీడీ తీసి లేదా కింది ఏదేని నెంబర్‌కు యూపీఐ ద్వారా చెల్లించి స్క్రీన్ షాట్ జిరాక్స్, పూర్తి దరఖాస్తు కాపీని ప్రిన్సిపాల్ టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ ఆశోక్‌నగర్, మండలం ఖానాపురం, వరంగల్ జిల్లా పిన్ కోడ్ 506132కు పంపాలని కోరారు. లేదా సంబంధిత జిరాక్స్ పత్రాలు (ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ షార్ట్ మెమో, బోనోఫైడ్స్, క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్స్ సర్టిఫికెట్లు, 5 ఫోటోలు) తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9963584516, 9398068250, 8985469347 8978616155, 9553310104నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వెబ్‌సైట్ https://www.tgtwgurukulam.telangana.gov.in చూడాలని కోరారు.

కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్ ప్రకటన

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను రీషెడ్యూల్ చేస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పేపర్ జూన్ 11న, రెండో పేపర్ 13న, మూడో పేపర్ 15న, నాలుగో పేపర్ 19న, ఐదో పేపర్ 21న, ఆరో పేపర్ జూన్ 24న ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్ పోర్టల్‌లో చూడాలని సూచించారు.

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మహబూబాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 9న జరుగనున్న గ్రూప్-1 పిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గ్రూప్-1 పరీక్ష నిర్వహణ, వానాకాలం పంట విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా, స్కూల్ యూనిఫాం తయారీలపై గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. వానాకాలం పంట సీజన్ ప్రారంభమవుతుందని, రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పంపిణీలో ఎక్కడ ఇబ్బందులు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించకుండా అరికట్టాలని ఆదేశించారు. లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టిన చర్యలపై అధికారులు సఫలీకృతమయ్యారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పాఠశాల పునః ప్రారంభానికి ముందే ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫాం అందించాలన్నారు.



వీసీలో పాల్గొన్న అద్వైత్‌కుమార్‌సింగ్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 పరీక్షను 897 పరీక్ష కేంద్రాల్లో 4.03 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ జిల్లాలో అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్‌లు లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు..

టీజీపీఎస్‌సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సందేహాలను నివృత్తి చేసుకునేందుకు టోల్ ఫ్రీ నెంబర్ : 79950 74803ని ఏర్పాటు చేశామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష బయోమెట్రిక్ విధానంలో ఉంటుందని, ఓఎంఆర్ విధానంలో ఈనెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని చెప్పారు. హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై మూడు నెలల్లోపు దిగిన పాస్‌ఫొటోసైజ్ ఫొటోను అతికించాలని, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు వారి హాల్‌టికెట్‌లో పేర్కొన్న విధంగా పరీక్ష రాసేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తారని చెప్పారు. హాల్‌లోకి వెళ్లే ముందు కేంద్రం వద్ద హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో అతికించాలని, హాల్‌లో ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్‌పై సంతకం చేయాలన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డు, లేదా ఉద్యోగ ఐడీ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వీటిల్లో ఏదైనా ఒకటి పరీక్ష కేంద్రంకు వెంట తీసుకుని వచ్చి సిబ్బందికి చూపించాలన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో వివరాలన్ని స్పష్టంగా ఉన్నాయో.. లేదో చూసుకోవాలన్నారు. పరీక్ష సమయానికి ఒక్కరోజు ముందుగా పరీక్ష కేంద్రాన్ని సందర్శించి కచ్చితమైన అడ్రస్‌ను తెలుసుకోవాలని సూచించారు. గంట ముందు అభ్యర్థి పరీక్ష కేంద్రంలో రిపోర్టు చేయాలని, ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తారని, ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రం వద్ద గేటును మూసివేస్తారని చెప్పారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లు, వాచ్‌లు తదితర వస్తువులు వెంట తీసుకురావొద్దని అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూన్ 6 : మహబూబాబాద్ టౌన్-1 సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-1 ఏఈ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్-1 సబ్‌స్టేషన్ పరిధిలోని భవానిశంకర్‌తండా, మదర్‌థెరిస్సా కాలేజ్, ప్లైఓవర్ ఏరియా, వ్యవసాయ మార్కెట్, శిఖార్‌ఖానా గడ్డ, సూర్య థియేటర్, మునిసిపాలిటీ కార్యాలయం, అండర్‌బ్రిడ్జి, స్టేషన్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్‌అండ్‌బీ గెస్‌హౌస్‌రోడ్, భవానినగర్‌తండా, పోలీస్ క్వార్టర్స్, హస్తీనాపురం కాలనీ, నందనగార్డెన్ ఏరియా, గోపాలపురం కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ముగిసిన ఐసెట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 : ఐసెట్-2024 గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజులు సీబీటీ పద్ధతిలో జరుగుతున్న ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతగా ముగిసిందని ఐసెట్ కన్వీనర్ ఎస్. నర్సింహాచారి తెలిపారు. బుధ, గురువారాల్లో ఆంధ్ర, తెలంగాణలో జరిగిన పరీక్షకు 86,156 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 77,942 మంది (90.47 శాతం) విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో ఎంపిక చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 4,659 మందికి గాను 4,364 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 8న ఐసెట్ ప్రాథమిక కీ విడుదల చేస్తున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు. అభ్యంతరాలున్న విద్యార్థులు జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్-2024 పోర్టల్‌లో వారి అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రవి (ఫైల్)

సంగెం, జూన్ 6 :రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందగా, మరొకరు చికిత్స పొందుతున్నారు. వరంగల్ జిల్లా సంగెం ఎస్సై నరేష్ కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం రౌతుగూడెంకు చెందిన మాలోతు రవి (34) తన భార్య సరిత, తల్లిసోనాలతో కలిసి తిమ్మాపురం ఓ కార్యక్రమానికి బుధవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. మండల కేంద్రానికి వచ్చేసరికి ఓ బాలుడు ద్విచక్రవాహనం నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. దీంతో రవి, సరిత, సోనా గాయపడ్డారు. స్థానికులు సాయంతో క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి రవి మృతి చెందగా, తల్లి సోనా ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. గురువారం మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

మరిపెడ రూరల్, జూన్ 6 : విద్యుదాఘాతంతో ఇంటిలోని సామగ్రి అంతా (సుమారు రూ.2లక్షలు) దగ్ధమైన సంఘటన బుధవారం రాత్రి తానంచర్ల రెవెన్యూ పరిధిలోని కోట్యా తండా జీపీ శివారు చౌలా తండాలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం. చౌలా తండాకు చెందిన అంగోతు సేవియా బుధవారం రాత్రి గాలి దుమారంతో కూడిన భారీ వర్షానికి విద్యుదాఘాతంతో తన ఇంటిలోని ఫ్రిడ్జ్, కూలర్, బీరువాలో పెట్టుకున్న నగదు రూ 35 వేల, భూమికి చెందిన రెండు పట్టాదారు పాస్‌పుస్తకాలు, బట్టలు, ఇంటిలోని నిత్యావసర సామగ్రి దగ్ధమయ్యాయి. దీంతో భార్యాభర్తలు కట్టుబట్టలు మాత్రమే ఉన్నాయని కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం తహసీల్దార్ సైదులుకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ వచ్చి దగ్ధమైన సామగ్రి వివరాలు సేకరించారు. దీంతో వాల్య, అజ్మీర, డాక్న, ఆనేకట్ట మరి కొన్ని తండాలలో గత రాత్రి నుంచి కరెంట్ లేదని గిరిజనులు అనేక సార్లు కరెంట్ ఏఈకి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడంలేదని, దీంతో అనేక ఇబ్బందుల పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు.

జాతీయజెండా గద్దె పాక్షికంగా ధ్వంసం

కేసముద్రం, జూన్ 6 : మండలంలోని ఇంటికన్నెలో బుధవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో రావడంతో కలకలం రేపింది. అయితే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనే పాక్షికంగా ధ్వంసమైనట్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతులు చేయించినట్లు చెప్పారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన ట్రాక్టర్

● త్రుటిలో తప్పించుకున్న డ్రైవర్

కేసముద్రం, జూన్ 6 : మండలంలోని ధర్మారంతండాలో చెల్క దున్నుతున్న ట్రాక్టర్ ఇంజన్ ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలోకి వెళ్లింది. రమేష్ తన ట్రాక్టర్‌ను మరోరైతు చెల్కను దున్నేందుకు తీసుకురాగా ముందు టైరు ఊడిపోయింది. దీంతో ట్రాక్టర్ ఒకవైపునకు లాక్కుంటూ వెళ్లి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలోకి నెమ్మదిగా జారింది. అలాగే బావిలోకి జారుతున్న ఇంజన్‌పైనే ఉన్న రమేష్ ట్రాక్టర్ నీళ్లలోకి మునగగానే తాను నీళ్లలోకి దూకి ప్రాణాలను రక్షించుకున్నాడు. అయితే ఘటన బుధవారం చోటు చేసుకోగా గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

సర్టిఫికెట్ల కోసం అర్జీదారుల ఆందోళన

కేసముద్రం, జూన్ 6 : కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు గురువారం ఆందోళన నిర్వహించారు. పలువురు దరఖాస్తుదారులు మాట్లాడుతూ గత నెల 27న మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కోసం ఆయా సర్టిఫికెట్లు తమ పిల్లలకు అత్యవసరం కావడంతో తాము కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. తహసీల్దార్ దామోదర్ నల్గొండలోని ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపునకు వెళ్లగా డిప్యూటీ తహసీల్దార్ రాములు కలెక్టరేట్‌కు వెళ్లారు. అర్జీదారుల ఆందోళన విషయం తెలుసుకున్న ఆయ హుటాహుటిన కార్యాలయానికి చేరుకొని సర్టిఫికెట్లను 'ఆన్‌లైన్'లో జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురవి, జూన్ 6 : మండల కేంద్రానికి చెందిన పుట్టబత్తిని శంకర్ (38) అనుమానస్పద స్థితిలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. స్నేహితులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. శంకర్‌ను ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొని, లేదా ఎవరైనా దాడి చేసిన స్థితిలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో బుధవారం చేర్పించారు. అతన్ని ఆస్పత్రిలో చేర్పించిన వారి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శంకర్ అవివాహితుడు. అతని అన్న పుట్టబత్తిని వీరన్న మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'కేసముద్రంను మునిసిపాలిటీగా చేసే ఆలోచనను విరమించుకోవాలి'

కేసముద్రం, జూన్ 6 : మండల కేంద్రాన్ని మునిసిపాలిటీగా చేసే ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణ వాచ్‌డాగ్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. ధన్నసరి సమీపంలో గురువారం ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్యాల వీరన్న ఆధ్వర్యంలో కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ మునిసిపాలిటీ చేయడంతో ఉపాధి పథకం రద్దై కూలీలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. కేసముద్రాన్ని మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించాలని కోరారు. నర్సింగం వెంకటేశ్వర్లు, బాణాల రఘు, హరిదాసు వేణుగోపాల్, శ్రీనివాస్, యాకస్వామి, ఐలయ్య, బేతు సుధాకర్, చంద్రమ్మ, ఎల్లమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

పాత సామాన్లకు వేలం

మహబూబాబాద్ రూరల్, జూన్ 6 : మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న అపరిచిత, గుర్తుతెలియని వాహనాలు, పోలీస్ వాహనాలకు చెందిన టైర్లు, బ్యాటరీలు, విడి సామగ్రికి గురువారం వేలం పాట నిర్వహించినట్లు ఏఎస్పీ జోగుల చెన్నయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించగా, సుమారు 50 మందికిపైగా వేలం పాటలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ వేలం పాటలో మొత్తం నగదు రూ.90,500లకు వేలం జరిగినట్లు చెప్పారు. ఈ సొమ్ము మొత్తాన్ని జిల్లా పోలీస్ ట్రెజరీకి డీడీ ద్వార జమ చేయడం జరుగుతుందని చెప్పారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బాలాజీవరప్రసాద్, ఏవో సోములునాయక్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సక్సెస్ చేయండి

మహబూబాబాద్ రూరల్, జూన్ 6 : జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీస్‌అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి తిరుపతి, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, పోక్సో కోర్టు పీపీ పద్మాకర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

● ఇద్దరిపై కేసు నమోదు ● ఎక్సైజ్ సీఐ చిరంజీవి

సీరోలు, జూన్ 6 : మహబూబాబాద్ ఎక్సైజ్ పరిధిలోని సీరోలు మండలం సూర్య తండాలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యతండాలో ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 9 లీటర్ల గుడుంబా, 180 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని తెలిపారు. గుడుంబా కాచిన అజ్మీర హిరాని, అజ్మీర అనితలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. గుడుంబా కాచిన, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల పరిష్కారానికి కృషి

● డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్

తొర్రూరు, జూన్ 6 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నట్లు తొర్రూరు డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్ తెలిపారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆయా సెక్షన్లకు సంబంధించిన అధికారులను సంప్రదించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని తొర్రూరు టౌన్:9491075150, చిన్న వంగర : 9491074684, పెద్దవంగర : 9491075155, నెల్లికుదురు:9491075151, మునిగేలవేడు:9491075152, దంతాలపలి:9491075153, నర్సింహులపేట:9491075154, మరిపెడ:9491075122, ఎల్లంపేట:9491075124, చిన్నగూడురు:9491075126 విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కేటాయించిన యఫ్ఓసీ ఫోన్ నెంబర్లను సంబంధిత ఏఈలతోపాటు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి'

బయ్యారం, జూన్ 6 : ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు దినసరి కూలీ రూ.600 చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మైదాన మండల కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నర్సాతండా, గొల్లగూడెం గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాలను ఎన్డీ నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారంపై ఈ నెల 10న బయ్యారంలో జరిగే నిరసన కార్యక్రమంలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నేతలు లింగమల్లు, హన్మ, శేషు, రాకేష్ పాల్గొన్నారు.

'పంట రుణాలను మాఫీ చేయాలి'

గంగారం, జూన్ 6 : రైతులు సాగుకు ఇచ్చిన పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా నాయకుడు పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వాగ్దానంలో బాగంగా ఇచ్చిన రూ. రెండు లక్షల పంట రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. కుర్సం రంగయ్య, జజ్జర వీరస్వామీ, జోగా రామయ్య, వెంకన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి : రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ వెంటనే తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీని చేయాలని ఏఐపీకేఎస్ డివిజన్ అధ్యక్షుడు ఉడుగుల రాములు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి కొమ్మనబోయిన వెంకన్న, మండల నాయకులు దుడిమెట్ల లింగన్న, సెగ్గం నాగయ్య, ఉడుగుల మధుకర్, పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు ఏరుగొండ ప్రవీణ్ పాల్గొన్నారు.

'ప్రహరీ సమస్యను పరిష్కరించాలి'

● రైల్వే ఏడీఆర్ఎంలకు చైర్మన్ వినతి

డోర్నకల్, జూన్ 6 : డోర్నకల్ రైల్వే పరిధిలోని రైల్వేశాఖ నూతనంగా చేపట్టిన డ్రైనేజీ కాలువ, ప్రహరీ నిర్మాణం వల్ల డోర్నకల్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న రైల్వే అధికారులకు విన్నవించారు. గురువారం డోర్నకల్ రైల్వే జంక్షన్‌కు ప్రత్యేక రైలులో వచ్చిన ఏడీఆర్ఎంలు సుబ్రమణ్యం, గోపాల్‌నాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. డోర్నకల్‌కు చెందిన కొందరు వ్యక్తులు రైల్వే స్థలాలు అక్రమణకు గురవుతున్నాయని, లేనిపోని నిరాధారమైన రైల్వే అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మూడో మెయిన్‌రోడ్డు, నాల్గవ మెయిన్‌రోడ్డు వద్ద కల్వర్టులను నిర్మించాలని, అలాగే జైన మందిరం, భగత్‌సింగ్ విగ్రహం వద్ద కల్వర్టులను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డీఆర్‌యూసీసీ మాజీ సభ్యులు ఖాదర్, వర్తకసంఘం నాయకులు కాల మహేందర్‌కుమార్‌జైన్, కిశోర్‌కుమార్‌జైన్, కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామలింగేశ్వర కల్యాణం

చిన్నగూడూరు, జూన్ 6 : మండలంలోని ఉగ్గంపలిలో రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా పార్వతి రామలింగేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామి వారికి పంచామృత అభిషేకం, పుణ్యావాచనం, మడప ఆరాధన, రుద్ర హోమం, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, చిన్నగూడూరు జడ్పీటీసీ మూల సునితమురళిధర్‌రెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న ప్రత్యేక పూజలు చేశారు.

గడువులోగా పనులను పూర్తి చేయాలి

పెద్దవంగర, జూన్ 6 : పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. గురువారం మండలంలో శంకర్‌తండా, కొరిపెల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి'

వరిపెడ, జూన్ 6 : మరిపెడలోని బీసీ కళాశాల వసతి గృహ ప్రవేశాల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కల్పన తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఐటీఐ చదివే స్కాలర్‌షిప్ ఎంపికకు అర్హులైన విద్యార్థులను ఎస్సీ, ఎస్టీ, బీసీ రేషియో ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాల కోసం 99483 22446, 63052 08131, 62817 18795 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి రవిచంద్ర పరామర్శ



సత్తిరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలిఘటిస్తున్న ఎంపీ రవిచంద్ర

కేసముద్రం, జూన్ 6 : కేసముద్రం విలేజిలో ఇటీవలె వేముల సత్తిరెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గాయత్రి గ్రానైట్స్ యజమానులు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వద్దిరాజు కిషన్ గురువారం పరామర్శించారు. సత్తిరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించి, తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి వెంట జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య, నాగరాజు, సుధీర్‌కుమార్, రాంచంద్రారెడ్డి, యాకూబ్‌రెడ్డి, జగన్మోహన్ ఉన్నారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూన్ 6 : గర్భిణీలు అనారోగ్యం బారిన పడకుండా వైద్యుల సలహాల మేరకు తగినజాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బికళావతి బాయి సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో గురువారం మాతృమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలో 12 మాతృ మరణాలు సంభవించాయన్నారు. గర్భిణీలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ప్రసూతి మరణం అనేది గర్భవతిగా ఉన్నప్పుడు, గర్భ ముగిసిన 42 రోజుల లోపు తీవ్రతరం కాబడిన ఏదైనా కారణంతో మృతి చెందుతారని పేర్కొ న్నారు. గర్భిణీలు ఇంటివద్ద గానీ రెఫరల్ హెల్త్ ఫెసిలిటి వద్దకు తీసుకు వెళ్తున్నప్పుడు మార్గం మధ్యలో సంభవించే మరణాన్ని 24 గంటల నుంచి 48 గంటల్లోపు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, భూక్య వెంకట్రాములు, అంబరీష, బిందుశ్రీ, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, విద్య, వీరన్న, ప్రసాద్, మహేందర్‌రెడ్డి, పురుషోత్తం, కెవి.రాజు, మంగమ్మ, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

నీట్‌లో అనిక్‌రావుకు 626 మార్కులు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 6 : నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) అర్హత పరీక్ష- 2024 ఫలితాల్లో మహబూబాబాద్ పట్టణానికి చెందిన గోరుగంటి అనిక్‌రావు 626 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రెండు సెంటర్లలో మే 5న నిర్వహించిన అర్హత పరీక్షకు 685 (97.99 శాతం) హాజరయ్యారు. ఈనెల 4న విడుదల చేసిన నీట్ ఫలితాల్లో గోరుగంటి వెంగళరావు- మాధవి దంపతుల కుమారుడు అనిక్‌రావుకు 720 మార్కులకుగాను 626 మార్కులు సాధించి ఆల్ ఇండియా జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో 6,865వ ర్యాంకు, ఆల్ ఇండియాలో 52,153 ర్యాంకును సాధించారు. నీట్ ఫలితాల్లో అనిక్‌రావు ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్టీ కేటగిరిలో శ్రీశాంత్ రామ్ 488వ ర్యాంక్

కొత్తగూడ : నీట్ 2024లో మండలంలోని లక్ష్మీపురం (గుండ్రపల్లి) గ్రామానికి చెందిన పుల్సం శ్రీశాంత్‌రామ్ ఉత్తీర్ణత సాధించాడు. లక్ష్మీపురం (గుండ్రపల్లి) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, వనప్రేమి జనప్రేమి పుల్సం సాంబయ్య, సుజాత దంపతుల కుమారుడు శ్రీశాంత్ రామ్ నీట్‌లో 720 మార్కులకు 604 మార్కులు సాధించారు. ఆల్ ఇండియా నీట్ ఎస్టీ కేటగిరిలో 488వ ర్యాంక్ సాధించాడు. శ్రీశాంత్ రామ్‌ను పలువురు అభినందించారు.

ఎంపీ కావ్యను మర్యాదపూర్వకంగా కలిసిన కొంపెల్లి

మరిపెడ, జూన్ 6 : వరంగల్ ఎంపీగా నూతనంగా ఎన్నికైన కడియం కావ్యను మరిపెడ కాంగ్రెస్ నేత కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం వరంగల్‌లోని ఆమె ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ డిప్యూటీ సీఎం శ్రీహరితో పాటు కావ్యకు పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వెంట కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎస్కే.అఫ్జల్ ఉన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

(5వ పేజీ తరువాయి)

దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఈ ఉపఎన్నికలో మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన 48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. అయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'బడిబాట' షురూ..

(5వ పేజీ తరువాయి)

ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, యాకయ్య, రాజ సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అమ్మాపురంలో బడిబాట కార్యక్రమం డీఈవో రామారావు ప్రారంభించారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అడ్మిషన్‌ఫాంలను అందించారు. ఎంఈవో రాము, హెచ్‌ఎంలు తుమ్మ వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు వీరన్న, నాగమల్లయ్య, వెంకన్న, లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో బడిబాట కార్యక్రమాన్ని మన పాఠశాల మనందరి బాధ్యత అంటూ జడ్పీ హైస్కూల్ నుంచి రైల్వే సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నర్సింహారావు, ప్రభాకర్, వెంకట్రావ్, మారెడ్డి శ్రీనివాస్, శేష దీపిక, మెప్మా సిబ్బంది విమల, వినీల, రాజ్యలక్ష్మి, ఉపేంద్ర పాల్గొన్నారు.

● నెల్లికుదురు మండలంలోని పార్వతమ్మగూడెం పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం హెచ్.నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రూపారాణి ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని 6వ నుంచి 10వ తరగతి విద్యార్థులను కలిసి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వివరించారు. పీఈటీ కొమ్ము రాజేందర్, ఉపాధ్యాయులు జే.యాకయ్య, సమ్మిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, కిషన్, దేవేందర్, శిరీష, కె.యాకయ్య నారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

● కేసముద్రం మండలం అర్పనపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హసీనా, హెచ్‌ఎం నర్సింహారాజు, కార్యదర్శి ప్రవీణ్, వీవోలు లావణ్య, హరిణి, రాజమణి, రేణుక, ఉపాధ్యాయులు వినోద్, నర్సింహాస్వామి, శ్రీను, కరుణ, పాల్గొన్నారు.



కురవిలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నర్మద

● కురవి జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జడ్పీ సీఈవో నర్మద కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎంలు వాహీద్, ఉప్పలయ్య ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులు, మహిళ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.